నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ విధిగా ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని తెలిపారు. అర్జీదారులు పిజిఆర్ఎస్ కార్యక్రమానికి రాలేని పరిస్థితి ఉంటే ఆ అర్జీని Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేయవచ్చునని తెలిపారు.

నాలుగేళ్లుగా ఉద్యోగాల్లేవ్

- జిజిహెచ్ కాంట్రాక్టు సిబ్బంది అవస్థలు
- న్యాయస్థానం ఆదేశాలు పట్టని అధికారులు
- ఆసుపత్రిలో రోగులకు అరకొర సేవలే దిక్కు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గత 15 ఏళ్లుగా వైద్య సేవలు అందిస్తున్న కాకినాడ జిజిహెచ్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది అవస్థలు అన్నీ ఇన్నీ కావు. కరోనా వంటి మహమ్మారి వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం వారు సేవలు అందించారు. కానీ ప్రభుత్వం వీరిని ఉన్నట్టుండి రోడ్డున పడేసింది. నాలుగేళ్ల కితం ఉద్యోగాల నుంచి తొలగించడంతో కుటుంబాలన్నీ వీధిన పడ్డాయి. అయితే సిబ్బంది అనేక పోరాటాల ఫలితంగా చివరకు న్యాయస్థానం వారికి అనుకూలంగా తీర్పునిచ్చింది. అయినా అధికారులు కనీసంగానైనా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు మీనమేషాలు లెక్కింస్తుంది.

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓ, ఎలక్ట్రీషన్, ఫిట్టర్, ప్లంబర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లగా 65 మంది కాంట్రాక్ట్ సిబ్బంది 2021 వరకు నక్షత్ర ఏజెన్సీ అనే కాంట్రాక్టు సంస్థ ద్వారా విధులు నిర్వహించేవారు. అరకొర వేతనాలు మాత్రమే ఇచ్చినా, నెలల తరబడి పెండింగ్‌లో పెట్టినా వైద్య సేవలు అందించారు. అప్పులు చేసి ఒక పూట తిని మరో పూట పస్తులతో జీవనం గడిపారు. ఎప్పటికయినా కనీస వేతనాలు అమలవుతాయని, ఉద్యోగ భద్రత లభిస్తుందని ఆశతో విధులు నిర్వహించారు. ఇన్ని చేసినా ఈ సిబ్బందిని 2021 సెప్టెంబర్ 6న తొలగిస్తున్నట్లు ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. దీంతో తమను అన్యాయంగా తొలగించి రోడ్డున పడేశారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధాంతరంగా తొలగించడంతో జిజిహెచ్ ముందు శిబిరం ఏర్పాటు చేసి పోరాటం చేశారు. సుమారు రెండు నెలల పాటు శాంతియుత ఆందోళన చేశారు. చివరకు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో న్యాయస్థానం తొలగించిన సిబ్బందిని తక్షణమే వీధుల్లోకి తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. వాటిని తీసుకుని సిఐటియు నాయకత్వం ఆధ్వర్యంలో కాంట్రాక్టు ఉద్యోగులందరూ కలిసి ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్‌కి వినతిపత్రం అందించారు.

2018లో నియామకం

2018 అక్టోబరులో డిఎంఇ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) ద్వారా నక్షత్ర ఏజెన్సీ తరుపున రాష్ట్రంలో అన్ని జిల్లాలతో పాటు, కాకినాడ జిజిహెచ్‌లోనూ వివిధ కేటగిరీలలో సిబ్బందిని నియమించారు. 2020 జూలైలో అప్పటి ముఖ్యమంత్రి ఏ ఒక్క ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని తొలగించమని, ప్రతీ నెల ఒకటినే జీతాలు నేరుగా వారి ఖాతాలో పడేలా చేస్తామని వారిని ఆప్కాస్‌లో చేర్చారు. రెండేళ్ల పాటు కోవిడ్ మహమ్మారి ప్రజా జీవితాన్ని అస్తవ్యస్తంగా మార్చగా ఈ కాలంలో ఏ ఒక్కరు బయటకు రాని సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి సిబ్బంది విధులు నిర్వర్తించారు. ఉభయ గోదావరి జిల్లాలకు ఆరోగ్య ప్రధాయినిగా సేవలు అందిస్తున్న కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా అనేకమంది ఔట్ సోర్సింగ్ పద్ధతిలో సిబ్బంది సేవలందించారు. 1155 పడకలు గల జిజిహెచ్‌లో నిత్యం 2 వేల మందిపైగా ఇన్ పేషెంట్లు, 3000 మంది పైగా అవుట్ పేషెంట్లు వైద్య సేవలు పొందుతున్నారు. ఇక్కడ వైద్యం పొందుతూ నిరంతరం వేలాదిమంది ఆరోగ్యవంతులుగా ఇళ్లకు చేరుతున్నారు. పనిచేస్తున్న వైద్యులు, స్టాఫ్ నర్సులు, శాశ్వత సిబ్బందితోపాటు వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు కృషి చేస్తున్నారు. అయితే నాలుగేళ్ల కితం ఉన్నట్టుండి వీరిని తొలగించడంతో జిజిహెచ్‌లో వైద్య సేవలు సక్రమంగా అందని పరిస్థితి నెలకొంది. పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో రోగులు అనేక అవస్థలు పడుతున్నారు. ఇక్కడ అరకొర సౌకర్యాలు మాత్రమే అందుతుండడంతో రోగులు ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

కోర్టు ఆదేశాలు అమలు చేయాలి

అప్కాస్ ద్వారా నియమించబడిన తమను జిజిహెచ్ అధికారులు వెంటనే విధుల్లోకి తీసుకోవాలి. కొన్ని నెలలపాటు శాంతియుతంగా ఆందోళనలు చేసి చివరకు హైకోర్టును ఆశ్రయించాము. దీంతో న్యాయస్థానం మాకు అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేసింది. అధికారులు స్పందించాలి.

పి.గంగాధరరావు, బాధిత ఉద్యోగి

తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి

మమ్మల్ని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. మాకు చాలా సంతోషంగా ఉంది. 4 సంవత్సరాలుగా కుటుంబాలతో రోడ్డున పడ్డాము. అధికారులు వెంటనే స్పందించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలి.

-వసంత, ఎఫ్ఎన్ఓ

కనీస వేతనాలు లేవు

కొన్నేళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు కావడం లేదు. ఏనాడూ ఒకటవ తేదీన జీతాలు అందుకున్న పరిస్థితి లేదు. ఉద్యోగ భద్రత లేదు. రక్షణ సౌకర్యాలు కల్పించడం లేదు. అనారోగ్యానికి గురైతే ఇఎస్ఐ సౌకర్యం సైతం లేదు. కార్మిక చట్టాల ప్రకారం కనీస వేతనాలు, సౌకర్యాలు కల్పించాలి.

-అరుణ, ఎఫ్ఎన్ఓ, జిజిహెచ్

చిరంజీవినీకుమారి మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - కాకినాడ

విద్యావేత్త, అభ్యుదయవాది, ఐడియల్ కళాశాలలు సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి మృతి పట్ల సిపిఎం నాయకులు తీవ్ర సంతాపం ప్రకటించారు. ఆమె మరణవార్త తెలిసిన వెంటనే సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.బేబీరాణి, ఎం.రాజశేఖర్, సిహెచ్.రమణి, నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యులు కె.సత్తిరాజు, దుంపల ప్రసాద్, నాగాబత్తుల సూర్యనారాయణ ఆమె భౌతిక కాయం వద్ద నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రజా సంఘాల సంతాపం

డాక్టర్ చిరంజీవిని కుమారి భౌతిక కాయానికి ప్రజా సంఘాల నేతలు నివాళులర్పించారు. యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర వర్మ, రాష్ట్ర కార్యదర్శి టి.రవిచక్రవర్తి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.సూరిబాబు, కెవివి.నగేష్, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్.వర్మ, నాయకులు ఆలపాటి శ్రీనివాస్, ఎం.సుబ్బారావు, ఎన్‌వి. పద్మావతి, యు.సత్యనారాయణ, అంబేద్కర్ ఉద్యమ సీనియర్ నేత అయితాబత్తుల రామేశ్వరరావు పాల్గొన్నారు. ఆమె మరణం విద్యా, వైజ్ఞానిక, చారిత్రక, సాంస్కృతిక రంగాలకు తీరని లోటని అన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకురాలు బేబీరాణి

నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నేతలు

26వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 26వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో ఇంజనీరింగ్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ 26 రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. తమకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, తమ డిమాండ్లు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బాసిన భద్రరావు, కోణాల వెంకటరమణ, వాకాడ భాస్కరరావు, ఒ. సోనియా, నామ్ సూర్యప్రకాష్, పి.ప్రశాంత్, పచ్చిపాల శ్రీను, అయ్యప్ప స్వామి, తదితరులు పాల్గొన్నారు.

నిరసన శిబిరంలో ఆందోళన చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు



డెల్లాస్‌లో పాల్గొన్న ఆదిత్య పూర్వ విద్యార్థులు

ఆదిత్య పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - గండేపల్లి

ఆమెరికాలోని డల్లాస్ పరిసర ప్రాంతాల్లో స్థిరపడిన ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన పూర్తి విద్యార్థుల ఆపూర్వ కలయిక శనివారం జరిగింది. ఆదిత్యలో విద్యను పూర్తి చేసి అమెరికా చుట్టుపక్కల నగరాల్లో వివిధ కంపెనీల్లో ఉద్యోగాల్లో చేరి అక్కడే స్థిరపడిన సుమారు 80 మంది పూర్తి విద్యార్థులు వారి వారి కుటుంబ సభ్యులతో కలిసి డల్లాస్‌లో జరిగిన సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆదిత్య యూనివర్సిటీ అలుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆదిత్య యూనివర్శిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డీన్ అడ్మినిస్ట్రేషన్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, సలహాదారు డాక్టర్ టి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో చదివిన రోజుల్లో జరిగిన ముచ్చట్లు, అనుభవాలు, అనుభూతులను గుర్తు చేసుకున్నారని ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి సంతోషాన్ని వ్యక్తం చేశారు. తమ సంస్థ ప్రయాణం వాయు వేగంతో దూసుకుపోయి అనతి కాలంలోనే విశ్వవిద్యాలయంగా రూపాంతరం చెంది నేడు విశ్వవ్యాప్తం అయిందని సతీష్‌రెడ్డి అన్నారు.

రేషన్ దుకాణాల్లో సరుకుల పంపిణీ

వైసిపి పాలనలో ప్రవేశపెట్టిన ఎండియు వాహనాల ద్వారా నిత్యవసర సరుకుల పంపిణీని రద్దు చేసిన కూటమి ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీకి ఆదివారం శ్రీకారం చుట్టింది. జిల్లావ్యాప్తంగా కూటమి పార్టీలకు చెందిన ఎంఎల్ఎలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పలు రేషన్ దుకాణాలను ప్రారంభించారు. లబ్ధిదారులకు సరుకులను పంపిణీ చేశారు. పిఠాపురం, కాకినాడ రూరల్ మండలాల్లో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొని రేషన్ డిపోలను ప్రారంభించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

పిఠాపురం, కాకినాడ రూరల్ ప్రజాపంపిణీ వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం పిఠాపురం, కాకినాడ రూరల్ మండలం వలసపాకలు లో పర్యటించిన ఆయన రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరా శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్, ప్రభుత్వ విప్, ఎంఎల్‌సి పిడుగు హరిప్రసాద్, కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి, ఎంఎల్ఎ పంతం నానాజీ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్, ఎపి ఎస్ఐడిసి ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ కడలి ఈశ్వరి, మాజీ ఎంఎల్ఎలు ఎస్‌విఎస్ఎన్.వర్మ, పెండెం దొరబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మీడియాతో మాట్లాడారు. లబ్ధిదారులు రైస్ కార్డు నమోదైన డీలర్ దగ్గరే కాకుండా...తమ నివాస ప్రాంతాలకు దగ్గరలో ఉన్న ఏ రేషన్ షాపు నుంచైనా సరుకులు తీసుకునే వెసులుబాటు కల్పించామన్నారు. రేషన్ షాప్ ద్వారా బియ్యం, రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు వంటి చిరు ధాన్యాలు అందించేందుకు అవసరమని ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, పాడా పీడీ చైత్రవర్షిణి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఆర్ఎస్ ఎస్.సత్యనారాయణరాజు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ దేవులా నాయక్, లీగల్ మెట్రాలజీ డిసి జనార్ధన్‌రావు, తహశీల్దార్ గోపాలకృష్ణ, కమిషనర్ కనకారావు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు. అలాగే కాకినాడ రూరల్, కరప మండలాల్లోని పలు గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో నిత్యవసర సరుకుల పంపిణీని మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త పిల్లి సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. **పెద్దాపురం** స్థానిక మిరపకాయల వీధిలోని 6వ నెంబర్ రేషన్ షాప్‌ను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ శ్రీరమణి, తహశీల్దార్ సిహెచ్.వెంకట లక్ష్మి, మున్సిపల్ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల పద్మజ, రంది సత్యనారాయణ, తూతిక రాజు, కొరుపూరి రాజు, మార్ని చిన్న, రేషన్ డీలర్ల అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** మండలంలోని సిరిపురం గ్రామంలో రేషన్ దుకాణాన్ని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కుసరాజు, ఎంఎస్ఓ ఒ.రవి, జనసేన సమన్వయకర్త మేడిశెట్టి బాబి, ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, మాజీ జడ్‌పిటిసి జ్యోతుల పెదబాబు, నాయకులు బుద్ధ ఈశ్వ రరావు, చిక్కాల లక్ష్మణరావు కొప్పుల బాబ్జి పాల్గొన్నారు. **సామర్లకోట** మండలంలోని హుస్సేన్ పురంలో రేషన్ దుకాణం ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ చినరాజప్ప ప్రారంభించారు. అలాగే పట్టణ పరిధిలో పలు రేషన్ దుకాణాల వద్ద సరుకుల పంపిణీని టిడిపి నాయకులు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి నాయ కులు తోటకూర శ్రీనివాస్, గుమ్మల్ల రామకృష్ణ, చల్లా బుజ్జి, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్, పనసపాడు సర్పంచ్ చీకట్ల వెంకటేష్, పాల్గొన్నారు. **జగ్గంపేట** స్థానిక 1వ నెంబర్ రేషన్ దుకాణంలో సరుకుల పంపిణీని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. డీలర్లు పారదర్శకంగా వ్యవహరించాలని, లేనిపక్షంలో తగుచర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అత్తులూరి నాగబాబు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టిడిపి నాయకులు మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, తహశీల్దార్ జెవిఆర్.రమేష్, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు. **కాజులూరు** మండలం లోని గొల్లపాలెంలో రేషన్ దుకాణంలో సరుకుల పంపిణీని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్, సర్పంచ్ మౌనిక పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు. **గొల్లప్రోలు** పట్టణంలోని 5, 8 రేషన్ దుకాణాల్లో నిత్యవసర సరుకుల పంపిణీని తహశీల్దార్ కెవి.సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గుండ్ర సుబ్బారావు, జనసేన నాయకులు బస చిట్టిబాబు, గుల్ల సుబ్బారావు, బస సత్యనారాయణ పాల్గొన్నారు. **గండేపల్లి** గండేపల్లి గ్రామం లో టిడిపి మండల అధ్యక్షులు పోతుల మోహన్‌రావు, సొసైటీ మాజీ అధ్యక్షులు పరిమి బాబు రేషన్ దుకాణంలో నిత్యవసర సరుకుల పంపిణీని ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, నాయకులు కుంచే రాజా, బొల్లంరెడ్డి రామకృష్ణ. అడబాల భాస్కరరావు, సుంకవల్లి రమేష్, వెంపాటి రాజు పాల్గొన్నారు. **కరప** మండలంలోని కూటమి నాయకులు ఆధ్వర్యంలో రేషన్ దుకాణాల్లో నిత్యవసర సరుకులు పంపిణీని ప్రారంబించారు. ఈ కార్యక్రమాల్లో జనసేన పార్టీ నాయకులు భోగిరెడ్డి కొండబాబు, టిడిపి అధ్యక్షుడు దేవు వెంకన్న, యాళ్ల పండు, బి.గంగాధర్, పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలోని మాధవరాయునిపేటలో రేషన్ దుకాణాన్ని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, డీలర్ల సంఘం నాయకులు అందే కాశి, తహ శీల్దార్ పి.త్రినాధరావు, ఆర్ఐ రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్‌లో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కాజులూరులో బియ్యాన్ని పంపిణీ చేస్తున్న వాసంశెట్టి సత్యం

ఏలేశ్వరంలో సరుకులు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

సామర్లకోటలో రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

జగ్గంపేటలో రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

తాళ్లరేవులో రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

కార్టూ'నిజం'



పట్టణంలో తీవ్ర తాగునీటి సమస్య

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలో మూడు రోజులుగా ప్రజలు తాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. కనీసం ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారానైనా తాగునీటిని సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల డిప్యూటీ సిఎం, స్థానిక ఎంఎల్ఎ పవన్ కల్యాణ్ తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.70 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో పంప్ హౌస్‌ను సైతం నిర్మించారు. ఆ హౌస్‌ను ఎంఎల్‌సి నాగబాబు ఇటీవల ప్రారంభించారు. అయినా ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. రోజుల తరబడి తాగునీటి సరఫరా అంతరాయం కలుగుతోంది. ఏలేరు కాలువ వద్ద ఏర్పాటుచేసిన పంప్ హౌస్ ప్రాంతంలో మురుగు నీరు ఉండడం, విద్యుత్ సరఫరాలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. గొల్లప్రోలు పట్టణ పరిధిలో 20 వార్డులకు 11 లైన్ల ద్వారా వంతులు వారిగా మంచినీటి సరఫరా చేస్తున్నారు. పట్టణ పరిధిలో కుళాయిలు లేని సూరంపేట జగన్ కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా 12 రోజులకు ఒకసారి చేస్తున్నారని, అలాగే దేవీనగరం, శివాలయం ఏరియాకు 3 రోజుల నుంచి తాగు నీరు సరఫరా లేక ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మోటార్లకు మరమ్మతులు సమస్య వస్తున్నా అధికారులు అలసత్వం వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నూతనంగా నిర్మించిన పంప్ హౌస్

గిరిబాబును సత్కరిస్తున్న వైసిపి నాయకులు

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కిర్లంపూడి

జూన్ 4న ప్రత్తిపాడులో జరిగే వెన్నుపోటు దినం కార్యకమాన్ని విజయవంతం చేయాలని వైసిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. ఇటీవల కాలంలో నూతనంగా పదవులు పొందిన పలువురు వైసిపి నాయకులు ఆదివారం మాజీ మంత్రి, పిఎసి సభ్యులు ముద్రగడ పద్మనాభం నివాసంలో గిరిబాబు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ పదవుల పొందిన నాయకులందరూ పార్టీ విజయానికి కష్టపడి పని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం చేసే మోసాలను ప్రజలకు తెలియజేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రామిశెట్టి నాని, జిల్లా ఉపాధ్యక్షులు బెహరా దొరబాబు, ఎంపిపి గొళ్ల కాంతిసుధాకర్, పినిశెట్టి ప్రకాష్, మాసా ఇమ్మానియేల్, పులి సాల్మాన్‌రాజ్, ఇసుక పాటి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు శివన్నారాయణ సాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని గాడిమొగ పంచాయతీ చినవలసల గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులు మల్లాడి రాంబాబు, భవాని కుటుంబానికి ముమ్మిడివరం ఎఎంసి మాజీ ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అండగా నిలబడ్డారు. ఆదివారం బాధితులకు ఆర్థిక సాయంతోపాటు, బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు తాత్కాలికంగా రేకు షెడ్డు నిర్మించుకోవడానికి మెటీరియల్‌ను అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మల్లాడి వరదరాజు, కూటమి నాయకులు పెసింగి నాగబాబు, దుర్గాప్రసాద్, వీర వర్మ, నాగూరు, వీరబాబు పాల్గొన్నారు.

నగదు సాయం చేస్తున్న శివన్నారాయణ

జాగ్రత్తలతో కరోనా నివారణ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కొద్దికాలంగా స్తబ్దతగా ఉన్న కోవిడ్ వైరస్ మళ్ళీ చాప కింద నీరులా వ్యాప్తి చెందుతున్నందున అప్రమత్తంగా ఉండాలని పిఎంపి వైద్యులు కుమార్‌యాదవ్ సూచించారు. ఆదివారం రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలోకి ఇది సోకుతుందని అన్నారు. జలుబు, జ్వరం, దగ్గు, తలనొప్పి, నీరసం, గొంతు నొప్పి, అలసట ఉన్నవారు వైద్యులను సంప్రదించాలని తెలిపారు. అనంతరం బిపి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పని ప్రాంతంలో కార్మికుడు మృతి

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ములగపూడి పంచాయతీలోని విష్ణు మెటల్ గ్రానైట్ అండ్ సప్లయర్స్ క్వారీలో ఆదివారం బిల్డింగ్ చేస్తూ ఒక కార్మికుడు ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అనంతపురం జిల్లాకు చెందిన వడ్డే ఉమామహేష్(37) విష్ణు మెటల్ గ్రానైట్ అండ్ సప్లయర్స్ క్వారీలో పని చేస్తున్నాడు. ఆదివారం డ్రిల్లింగ్ పనిచేస్తూ కాలుజారి కిందకు పడిపోయాడు. దీంతో అతనని కాకినాడ జిజిహెచ్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

గుడిలో హుండీ చోరీ

ప్రజాశక్తి - కడియం

కడియం పెద్ద వినాయకుడి గుడిలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ బద్దలు కొట్టి దొంగతనానికి పాల్పడ్డారని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఉదయం కడియం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎఎస్‌పి అర్జున్, కడియం సిఐ అల్లు వెంకటేశ్వరరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్, సురేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి అర్జున్ మాట్లాడుతూ నేరాలు దొంగతనాలు నివారణకు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అవి పని చేస్తున్నాయో, లేదో పరిశీలించుకోవాలని సూచించారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - కోరుకొండ

మండలంలోని నిడిగట్లలో కోడిపందేలపై కోరుకొండ పోలీసులు ఆదివారం దాడి చేసి 10 మందిని అరెస్ట్ చేసారు. ఎస్ఐ కె.నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బందితో కోడిపందేలపై దాడి చేసి 10 మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.6 వేలు, రెండు కోళ్లు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నల్లజర్ల

నల్లజర్ల మండలం అచ్చన్నపాలెం వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై వ్యాన్‌ను బైకు ఢీకొని ప్రకాశపాలెం గ్రామానికి చెందిన సికిలే వెంకటేశ్వరరావు (30) అక్కడికక్కడే మృతి చెందాడు వెంకటేశ్వరరావుకు భార్య ఉషారాణి కుమారుడు ఉన్నారు. వెంకటేశ్వరరావు బైకుపై రాంగ్ రూట్లో నల్లజర్ల వైపు నుంచి అనంతపల్లి వైపు వెళుతుండగా వ్యాన్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ సంఘటనలో వెంకటేశ్వరరావు ఎగిరి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. నల్లజర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి -కొవ్వూరు

పట్టణంలో లాంచీల రేవు సమీపంలో గోదావరి నదిలో ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పట్టణ సిఐ పి.విశ్వం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మతుడు వయసు సుమారు 40 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని భావిస్తున్నారు. మతుడి వద్ద ఏ విధమైన ఆధారాలు లభ్యం కాలేదని సిఐ తెలిపారు. మతదేహాన్ని వెలికి తీసి కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ కి తరలించినట్లు ఆయన తెలిపారు. వివరాల కోసం 9440796622 నెంబర్‌కి కాల్ చేయాలనే ఆయన సూచించారు.

క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

విద్యతోపాటు, క్రీడల్లోనూ విద్యార్థులు, యువత రాణించాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక మహారాణి కళాశాలలో నెలరోజులుగా జరుగుతున్న అథలటిక్స్ శిక్షణా శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యాక్రమంలోలాయన పాల్గొని మాట్లాడారు. అన్ని రకాల క్రీడల్లోనూ యువతను ప్రోత్సహిం చాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మెటల్స్ ఆయన చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరి బాబురాజు, నాయకులు జాస్తి రమేష్, ఆర్ ప్రభాకర రావు, రంది సత్యనారాయణ, జిల్లా అథలటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టివిఎస్ రంగారావు, కె.సుబ్రహ్మణ్యం, పీడీలు పాల్గొన్నారు.

ఫోరెన్సిక్స్ మ్యాగజైన్ 6వ సంచిక విడుదల

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య ఫోరెన్సిక్ కళాశాల ఆధ్వర్యంలో ఫోరెన్సిక్స్ సైన్స్‌పై విడుదల చేస్తున్న ద్వైమాసిక పత్రిక 6వ సంచికను ఆదివారం విడుదల అయింది. ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా ఎస్‌పి డి.నరసింహకిషోర్, ఆదిత్య విశ్వవిద్యాలయం ఛాన్సలర్ డాక్టర్ ఎన్.శేషారెడ్డిలి, ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి లక్ష్మీరాజ్యం, ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీవిలాస్ అనిల్‌చవాన్, వైస్ ప్రిన్సిపల్ పివి.నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి నరసింహకిషోర్ మాట్లాడుతూ ఫోరెన్సిక్స్ సైన్స్ విద్య వ్యాప్తికి పత్రిక చేస్తున్న కృషిని అభినందించారు. పత్రికను జాతీయ స్థాయిలో విజయవంతం చేయడంలో నిరంతర సహకారం అందించినందుకు సంపాదకీయ బృందానికి, ఆదరిస్తున్న పాఠకులకు శేషారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న వైసిపి

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక మున్సిపల్ ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పేరుతో అభివృద్ధిని వైసిపి అడ్డుకుంటుందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప విమర్శంచారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గడచిన ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదని, తమ ప్రభుత్వం వచ్చాక సుమారు రూ.3 కోట్లకు పైబడి నిధులతో అభివృద్ధికి శ్రీకారం చుడితే వైసిపి నాయకులు ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పేరుతో మున్సిపల్ సమావేశాలు జరగకుండా అడ్డుకుంటున్నారన్నారు. పైగా సమావేశాన్ని నిర్వహించడం లేదంటూ అధికారులపై నిందలు వేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పేరుతో కోర్టు వరకూ వెళ్లారని, ఆ పార్టీ అంతర్గత వ్యవహారంతో తమకు సంబంధం లేదన్నారు. అవరోధాలన్నీ పరిష్కరించి సత్వరమే పట్టణ అభివృద్ధికి చర్యలు చేపడతామని అన్నారు.

బాలకార్మిక రహిత జిల్లాగా చేసేందుకు చర్యలు

కార్మిక శాఖ జిల్లా ఇన్‌ఛార్జి అధికారి, సహాయ కార్మిక కమిషనర్ బిఎస్ఎం.వలీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పు గోదావరి జిల్లాను 'బాల కార్మిక రహిత' జిల్లాగా చేసేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని కార్మిక శాఖ జిల్లా ఇన్‌ఛార్జి అధికారి, సహాయ కార్మిక కమిషనర్ బిఎస్ఎం.వల్లీ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో సంఘటిత, అసంఘటిత రంగాలలో లక్షలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. కార్మిక శాఖ ద్వారా అందించే సేవలను తెలియజేసేందుకు ఆ శాఖ ఉన్నతాధికారి 'ప్రజాశక్తి' పలకరించింది. ఆయన మాటల్లోనే...

బాల కార్మిక రహిత జిల్లాగా చేసేందుకు చర్యలు

బాల కార్మిక రహిత జిల్లాగా చేయుటకు పటిష్టమైన చర్యటు చేపడుతున్నాము. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా టాస్క్ కమిటీ ఆధ్వర్యంలో బాల కార్మికులను గుర్తించుటకు నిర్వహించుచున్న ప్రత్యేక తనిఖీలలో బాల కార్మికులను గుర్తించి యజమానులపై 17 కేసులు నమోదు చేశాము. అదేవిధంగా కనీస వేతనాల చట్టం, 1948 కింద బాల కార్మికులకు రావలసిన రూ.96,118 సొమ్మును యజమానులు నుంచి ఇప్పించటం జరిగినది. కార్మిక శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బచన్ బచావో ఆందోళన్ పేరుతో ఈ నెల 1 నుంచి 30 వరకు బాలకార్మికుల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాము.

యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు

జిల్లాలో వాణిజ్య సంస్థల యజమానులు, షాపుల నిర్వహకులు బాల కార్మికులను పెట్టుకుని పని చేయించు కోరాదు, బాల కార్మికులను పెట్టుకుని పని చేయించినట్లు నిర్ధారణ అయితే బాల మరియు కౌమార కార్మికుల (నిర్మూలన మరియు క్రమబద్ధీకరణ) చట్టం, 1986 కింద శిక్షార్హులు. అదే విధంగా బాల కార్మికులను పెట్టుకుని పని చేస్తున్నట్లు తెలిస్తే, సదరు వివరాలను స్థానిక కార్మిక శాఖ అధికారులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

వివిధ కార్మిక చట్టాల కింద రిజిస్ట్రేషన్/ లైసెన్స్

తూర్పు గోదావరి జిల్లాలోని షాపులు మరియు వాణిజ్య సంస్థల యజమానులు కార్మిక చట్టాల కింద తీసుకొనవలసిన అన్ని రిజిస్ట్రేషన్లు/ లైసెన్సులు ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చట్టం, 2015 క్రింద ఒక పత్రంలో తీసుకొనవచ్చును. యజమాని తన షాపునకు సంబంధించి రిజిస్ట్రేషన్/ లైసెన్సు కొరకు ఈ దిగువన తెలిపిన పత్రాలను తీసుకుని దగ్గరలో గల మీ-సేవ కేంద్రానికి వెళ్లి నమోదు చేయించుకోవాలి.

రిజిస్ట్రేషన్ లైసెన్స్‌కు కావల్సిన ధృవీకరణ పత్రాలు

షాప్/సంస్థ యజమాని యొక్క ఫోటో మరియు సంతకం(తప్పనిసరి), అదే విధంగా యజమాని యొక్క ఆధార్ కార్డు కాపీ అందజేయాలి. షాప్/ సంస్థ అడ్రెస్స్ తెలిపి ట్రేడ్ లైసెన్స్ /ఇతర లైసెన్స్/నేమ్ బోర్డు/కరెంట్ బిల్ (తప్పనిసరి), యజమానిచే ఆథరైజేషన్ లెటర్/స్వీయ ఆథరైజేషన్ బెటరీ(తప్పనిసరి). అదే విధంగా, అందుబాటులో ఉంటే పాన్ నెంబర్, జిఎస్‌టి సంఖ్య తెలపవలెను.

సుమారు 85 శాతం వరకూ ఈ-శ్రమ్ పథకం కింద నమోదు

అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ శ్రమ్ పోర్టల్‌ను ప్రవేశ పెట్టింది. 16-59 సంవత్సరాల మధ్య వయస్సు కల్గి, ఇఎస్ఐ, పిఎఫ్ సభ్యత్వం లేని అసంఘటిత కార్మకులు, ఈ పథకం కింద నమోదు కొరకు అర్హులు. అర్హులైన అసంఘటిత కార్మికులు అందరూ తమ ఆధార్ కార్డు నకలు, బ్యాంకు అకౌంట్ నెంటరు మరియు సెల్ ఫోన్ నెంబరు వివరాలతో సమీపంలోని గ్రామ / వార్డు సచివాలయాలు, సిఎస్‌సి సెంటర్ లేదా ఈ శ్రమ్ అధికారిక పోర్టల్‌లో ఉచితంగా సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం ఉంది. ఎవ్వరైనా నగదు డిమాండ్ చేస్తే కార్మిక శాఖకు ఫిర్యాదు చేయవచ్చు. జిల్లాలో 3,20,279 మంది అసంఘటిం కార్మకులు నమోదు చేసుకున్నారు.

అసంఘటిత కార్మికులలకు ఎక్స్-గ్రేషియా

ఈ-శ్రమ్ పథకంలో నమోదైన కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా వారికి ప్రభుత్వం రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందిస్తుంది. పాక్షిక అంగవైకల్యం పొందినట్లయితే రూ.1 లక్ష సాయం అందిస్తుంది. డెలివరీ రంగంలో పనిచేసే ఉద్యోగులు / కార్మికులు ఉచితంగా పేరు నమోదు చేసుకుని కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసే గుర్తింపు కార్డు పొందడం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందవచ్చు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రకృతి ఈశ్వరరావు

భవన నిర్మాణ కార్మికుల కూలి రేట్లు పెంపుదల

ప్రజాశక్తి - సామర్లకోట

నిత్యవసర వస్తువులు, విద్యుత్ ఛార్జీలు నానాటికీ పెరిగిపోతున్న నేపథ్యంలో భవన నిర్మాణ కార్మికుల కూలి రేట్లు స్వల్పంగా పెంచుతున్నట్లు సామర్లకోట భవన నిర్మాణ కార్మికుల సంఘం ప్రకటించింది. ఆదివారం ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ పట్టణ కమిటీ సమావేశం ప్రకృతి ఈశ్వరరావు అధ్యక్షతన సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వర రావు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువులు ధరలు, గ్యాస్ ధరలు, విద్యుత్ ఛార్జీలు, ఇంటి పన్నుల పెంపుదల కారణంగా భవన నిర్మాణ కార్మికులకు జీవనం కష్టంగా మారిందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా స్వల్పంగా కూలీ రేట్లు పెంచడం జరుగుతుందని తెలిపారు. జూన్ 1 నుంచి నూతన కూలీ రేట్లు అమలులోకీ వస్తాయని, భవన నిర్మాణ యజమానులు కార్మికులకు సహకరించాలని కోరారు. మేస్త్రికి గతంలో రూ.850 ఉండేదని, దానిని రూ.900కు, కూలీలకు గతంలో రూ.700 ఉండేదని, దానిని రూ.750కి పెంచినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు బేవర బంగా రయ్య, షేక్ బాషా, పి.శ్రీరామ్, సిఐటియు మండల అధ్యక్షులు బి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కె.ప్రసాదరావు, వి.కొండలరావు, కరణం గోవిందరాజు పాల్గొన్నారు.

రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం

ప్రజాశక్తి - పిఠాపురం

రాష్ట్రంలో రైతంగాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎఎంసి ఛైర్‌పర్సన్ వాకపల్లి దేవి, వైస్ ఛైర్మన్ గాది రాజుబాబులతో పాటు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎఎంసి ఛైర్మన్‌గా ఒక దళిత మహిళలకు మొదటిసారి జనసేన తరపున అవకాశం కల్పించామన్నారు. రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ముందు ఉంటుందన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రైతాంగానికి ఉపయోగపడే విధంగా ధాన్యం కొనుగోలు, ఫెర్టిలైజర్స్ విత్తనాల పంపిణీ విషయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీని ఉపయోగించు కుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమానికి ఎంఎల్‌సి పిడుగు హరిప్రసాద్, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి, ఎంఎల్ఎ పంతం నానాజీ, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్, మాజీ ఎంఎల్ఎలు ఎస్‌విఎస్ఎన్. వర్మ, పెండెం దొరబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, జిల్లా సహాయ మార్కెట్ సంచాలకులు పి.రాఘవేంద్ర కుమార్, డిప్యూటీ ఉపసహాయసంచాలకులు లావణ్య, మార్కెట్ కమిటీ కార్యదర్శి ప్రమీల, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారం చేస్తున్న మార్కెట్ కమిటి పాలకవర్గం

పోటాపోటీగా నినాదాలు చేస్తున్న టిడిపి, జనసేన శ్రేణులు

బలప్రదర్శనకు దిగిన జనసేన-టిడిపి వర్గీయులు

వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం మహోత్సవంలో టిడిపి -జనసేన పార్టీలు బల ప్రదర్శనకు దిగాయి. జనసేన, టిడిపి చెందిన ప్రజాప్రతినిధులు నాయకులు సమక్షంలోనే జై వర్మ అంటూ టిడిపి వర్గీయులు, జై జనసేన అంటూ జనసైనికులు నినాదాలతో హోరెత్తించారు. ఈ నేపథ్యంలో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య కొంత తోపులాట జరిగింది. వేదిక మీద ఉన్న జనసేన నేతలు, ప్రజాప్రతినిధులు వారిస్తున్న సరే కిందనుంచి టిడిపి వర్గీయులు జై వర్మ జై వర్మ అంటూ నినాదాలతో హోరెత్తించారు. దీంతో వేదిక మీద ఉన్న జనసేన నేతలు జై కూటమి జై జై కూటమి అని ప్రతి నినాదాలు చేశారు. సమావేశం ప్రారంభం నుంచి చివరి వరకు నినాదాల ఇవ్వడంలో ఎక్కడ తగ్గలేదు.

వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - యంత్రాంగం

సామర్లకోట ఈనెల 4వ తేదీన వైసిపిలో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి చెందిన పోస్టర్‌ను వైసిపి ప్రజాపతినిధులు, నాయకులు ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ వెన్నుపోటు కార్యక్రమాన్ని జయప్రదం చేయాని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, పెద్దాపురం మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, వైసిపి పట్టణ అధ్యక్షులు పాగా సురేష్ కుమార్, నాయకులు ఆవాల లక్ష్మీనారాయణ, మోరంపూడి రంగ, తలారి దొరబాబు, మాజీ ఎంపిపి అత్తిలి వెంకట సీతారామస్వామి, తదితరులు పాల్గొన్నారు. **పిఠాపురం** స్థానిక వైసిపి కార్యాలయంలో మాజీ ఎంపీ, నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జ వంగా గీత నాయకులతో కలిసి వెన్నుపోటు పోస్టర్‌ను ఆవిష్కరించారు. 4న జరిగే వెన్నుపోటు దినం ధర్నాలో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. **గండేపల్లి** స్థానిక వైసిపి కార్యాలయంలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ నిర్వహించిన సభలో మాజీ మంత్రి తోట నరసింహం పాల్గొని మాట్లాడారు. 4న జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమంలో మండలం నుంచి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎంపిపి చెలగల దొరబాబు, కుంచె చినబాబు, ఓబిన్ని వీరబాబు, అవసరాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వేగవంతంగా పిఠాపురం రోడ్డు పనులు

ప్రజాశక్తి - సామర్లకోట

గత ప్రభుత్వ పాలనలో పిఠాపురం రోడ్డులో కూలిపోయిన చిన్నయేటి వంతెనను మూడేళ్ల అనంతరం నిర్మించి నిర్లక్ష్యంగా వదిలేసింది. ప్రస్తుతం వంతెన రైలింగ్ తదితర పిఠాపురం రోడ్డు విస్తరణ పనులు అతివేగంగా చేపట్టారు. పిఠాపురం నుంచి కోదండరామపురం వరకు రోడ్డు విస్తరణ పనులు దాదాపుగా పూర్తి చేయగా, కోదండరామపురం నుంచి ఉప్పు వారి సత్రం మీదుగా సామర్లకోట జంక్షన్ వరకు అభివృద్ధి పనులు సాగుతున్నాయి. చిన్నయేటి వంతెన కూలిపోయి మూడేళ్ల అనంతరం వైసిపి ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టారు. అయితే వంతెనకు రైలింగ్ నిర్మించకుండా వదిలేశారు. దీంతో పిఠాపురం రోడ్లో ప్రయాణించే వాహనదారులు నిత్యం నరకాన్ని చవిచూసేవారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాల తొలగింపుతో పాటు, బ్రిడ్జి కి ఇరువైపులా రైలింగ్ను నిర్మిస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించి అవరోధంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్పు చేసే ప్రక్రియను ట్రాన్స్ కో అధికారులు ప్రారంభించారు. ఈ పనులను విద్యుత్ శాక ఎడిఇ కిరణ్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ పనుల కారణంగా బ్రౌన్‌పేట, ఉప్పువారి సత్రం, టిడ్ కో గృహ సముదాయాలు, జల్లూరు గ్రామం మీదుగా వెళ్లే వ్యవసాయ ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు మధ్యాహ్నం వరకు అంతరాయం ఏర్పడింది.

పనులు చేస్తున్న కార్మికులు

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏడుకొండలుకు సత్కారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షులు వడ్డి ఏడుకొండలుకు ఘన సత్కారం జరిగింది. ఇటీవల పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా ఉగాది నంది పురస్కారం అవార్డును ఆయన అందుకున్నారు. ఈ నేపథ్యంలోనే విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం ఏడుకొండలు, దుర్గభవాని దంపతులను దుస్సాలువ పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, ముమ్మిడివరం ఎఎంసి మాజీ ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జడ్‌పి మాజీ ఛైర్మన్ దున్న జనార్దనరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు అత్తిలి బాబూరావు, ఇంజరం సర్పంచ్ ముద్దన శివరామప్రసాద్, ఎండియుడబ్ల్యూఏ అధ్యక్షులు కన్నీడి వెంకటరమణ, కెవిపిఎస్ మండల అధ్యక్షులు విప్పర్తి శ్రీనివాస్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, కమిడి ఈశ్వరి బాయి, జక్కల ప్రసాద్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

భవన నిర్మాణంలో పనిచేస్తూ ప్రమాదానికి గురైన పెయింటింగ్ వర్కర్ దువ్వా వీరబాబు కుటుంబానికి పాండవ గిరి పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.33 వేలు ఆర్థిక సాయాన్ని అందిజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కార్మికు లందరూ సొంతంగా ఈ నిధిని సమీకరించి వీరబాబు కుటుంబానికి అందజేశారన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు అమల కాకపోవటంతో కార్మికులు అనేక పథకాలు పొందలేకపో తున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పున్నరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు వడ్డి సత్యనారాయణ, కార్యదర్శి యాసలపు రమేష్, కోశాధికారి కరణం ప్రసాదరావు, శెట్టి రాజు, ఆర్.చంద్రశేఖర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయాన్ని అందిస్తున్న యూనియన్ నాయకులు

3న మరిడమ్మ తొలి గరగల ఉత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎసి విజయలక్ష్మి

ఈనెల 25 నుంచి ప్రారంభమయ్యే మరిడమ్మ అమ్మవారి జాతర ఉత్సవాల సందర్భంగా ఈ నెల 3వ తేదీన అమ్మవారి తొలిగరగల ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఏడాది జాతర ప్రారంభానికి ముందు అమ్మవారి గరగల ఉత్సవం నిర్వహించటం ఆనవాయితీగా వస్తుందన్నారు. పట్టణ పరిధిలోని అన్ని ప్రాంతాల ప్రజలు ఈ ఉత్సవంలో పాల్గొంటారన్నారు. వర్షాలు బాగా పడి పంటలు బాగా పండాలని మహిళలు గరగలకు పూజలు నిర్వహిస్తారన్నారు.

అన్నదానం తాత్కాలికంగా నిలిపివేత

మరిడమ్మ ఆలయంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని అమ్మవారి జాతర సందర్భంగా ఆదివారం నుంచి తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. జాతర ఉత్సవాలు ముగిసిన అనంతరం అన్నదానం తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు. దీనిని యాత్రికులు గమనించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

కొనసాగుతున్న మెడికల్ క్యాంప్

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఆవరణలో ప్రతి నెల మొదటి ఆదివారం నిర్వహించే మెడికల్ క్యాంపు ఆదివారం కొనసాగింది. క్యాంపు నిర్వహణకు ఫ్రెండ్స్ సభ్యులు సత్యానందం మనవరాలు అపూర్వ ఫస్ట్ ఇయర్ ఎంపిసి గ్రూపులో 470 మార్కులకు 465 మార్కులు సాధించడంతో మెడికల్ క్యాంపు కావలసిన మెటీరియల్, కూల్ డ్రింక్స్‌లను సమకూర్చారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మాట్లాడుతూ ప్రతిరోజు వాకింగ్‌తో పాటు ఆరోగ్య చెకప్ కూడా అవసరమని అన్నారు. బిపి, షుగర్ చెకప్ చేసుకోవడం కోసం రూ.200 ఖర్చు అవుతుందని, ఉచిత క్యాంపులో ఆ ఖర్చు లేకుండా పరీక్షలు చేయించుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ సైపుల్లా, ఉపాధ్యక్షులు జాన్ కెనడి, జాయింట్ సెక్రెటరీ నక్క శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - కరప

వేళంగి మెర్లాస్ జడ్‌పి ఉన్నత పాఠశాల 1999 - 2000 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు అసోసియేషన్ ఆఫ్ ఫ్రెండ్స్ ఫర్ ఎవర్ ఆధ్వర్యంలో ఆత్మీయ స్నేహ సమ్మేళనం జరిగింది. కెవివిఎస్ఎస్.గుణేశ్వరరావు అధ్యకతన జరిగిన ఈ కార్యక్రమంలో స్కూల్ ఆవరణలో అతిథులుగా మెర్ల వీరయ్యచౌదరి, డాక్టర్ బోండా వెంకన్నరావు, అప్పటి పాఠశాల హెచ్ఎం నేమాని వెంకటరామారావు, పట్టాభి రామారావు పాల్గొని తెలుగుతల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఉపాధ్యాయులను, అతిథులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గరగ అనిత, హేమారావు, వనుం ఉపేంద్రనాథ్, కడలి లోవరాజు, బి. సతీష్, సీతాలక్ష్మి, తాతాజీ, అడపా వెంకటేశ్వరరావు, తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన పలువురు వైసిపి కార్యకర్తలు

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ములగపూడి గ్రామానికి చెందిన అంకంరెడ్డి సురేష్ ఆధ్వర్యంలో వైసిపికి చెందిన పలువురు కార్యకర్తలు టిడిపిలో చేరారు. ఆదివారం ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ సమక్షంలో చేరిన వారికి ఆమె టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరినట్లు ఆమె తెలిపారు. అనంతరం రేషన్ షాప్‌ను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గంటిమళ్ల రాజ్యలక్ష్మి మాజీ ఎంపిపి భాస్కర్.బాబు, టిడిపి మండల అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ సత్యనారాయణ, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు గాడి రాంబాబు, ఎంపిటిసి సభ్యులు యామల సురేష్, కోసూరీ కృష్ణవర్మ, పలు గ్రామాల సర్పంచులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ములగపూడి జడ్‌పి ఉన్నత పాఠశాల 2000-01 సంవత్సర 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 25 సంవత్సరాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులతో పాఠశాల సందడిగా మారింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

క్రికెట్ కార్నివాల్ విజేత డైనమిక్ బాయ్స్

ప్రజాశక్తి - కరప

వలస పాకల క్రికెట్ కార్నివాల్ సీజన్ 4 పోటీల్లో డైనమిక్ బాయ్స్ జట్టు విజేతగా నిలిచింది. గత నెల 15 నుంచి జూన్ 1 వరకు నిర్వహించిన పోటీల్లో డైనమిక్ బాయ్స్ జట్టు విన్నర్ గాను, ఎక్స్పీరియన్స్ లెజెండ్స్ జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ వాసంశెట్టి రామారావు, కరప గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు విజేతలకు బహుమతులు అందజేశారు.

ఇంగ్లీష్ గ్రామర్‌పై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం ఇంగ్లీష్ గ్రామర్‌పై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన శిబిరంలో హెచ్ఎం రాళ్లపల్లి వెంకటేశ్వరరావు ఇంగ్లీష్ గ్రామర్‌పై శిక్షణ ఇచ్చారు. నీతి కథలు, నీతి పద్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లయ్య, పాఠకులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు ఎన్‌టిఆర్ స్మారక అవార్డు

ప్రజాశక్తి - జగ్గంపేట

రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావుకు ఎన్‌టిఆర్ స్మారక అవార్డు లభించింది. ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా విజయవాడ సిద్ధార్థ కళాశాల వేదికపై ఎక్సరే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అందించిన ఆ అవార్డును సినీ నటులు రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా అవార్డును ఆయన అందుకున్నారు.

మెయిన్స్ పరీక్ష కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో ఎపి పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షా కేంద్రాన్ని ఎస్‌పి బిందుమాధవ్ పరిశీలించారు. ఆదివారంఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకూ పరీక్ష జరిగింది. ఈ పరీక్షలకు 4447 మందికి గాను 4223 మంది హాజరైనట్టు ఎగ్జామ్స్ కో ఆర్డినేటర్. డాక్టర్ ఎ.రమేష్ తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని ఎస్‌పి బిందుమాధవ్‌తోపాటు, పరీక్షా కేంద్రం ప్రత్యేక పరిశీలకులు, జెఎన్‌టియుకె ప్రొఫెసర్. డాక్టర్ బి.బాలకృష్ణ, డిఎస్‌పి శ్రీహరిరాజు పరిశీలించారు.

మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

A.S.S.R. No. 5385/2024

Between:

సిద్ధాంతపు విజయకుమార్ **-అప్పిలెంట్**

మరియు

సిద్ధాంతపు బేబి మరియు వగైరాలు **-రెస్పాండెంట్స్**

R-3: సిద్ధాంతపు ప్రశాంతి, D/o. (లేటు) జార్జి, వయస్సు 25 సం॥లు, R/o. డోర్ నెం. 5-272, ఎస్.సి.పేట, జయంతి నగర్, సర్పవరం, కాకినాడ రూరల్ మండలం, కాకినాడ జిల్లా.

పై నెంబరు అప్పీలు కేసులో 3వ రెస్పాండెంటు అయిన మీకు ఎన్నిసార్లు శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టర్ పోస్టు వారి ద్వారాను నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 02-7-2025వ తేదీకి వాయిదా వేసినారు. ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని ఎడల పై అప్పీలు కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

దుగ్గన రాజబాబు, అడ్వకేట్

కాకినాడ, సెల్: 9397605394

మహారాజశ్రీ నర్సీపట్నం సివిలు జడ్జి వారి కోర్టులోసివిల్ జడ్జి (సీనియర్ డివిజన్):

H.M.O.P.NO: 98/2024

మధ్య:

1. ప్రగడ తనూజ **...పిటిషనర్**

మరియు:

1. ప్రగడ నాగ లింగేశ్వరరావు (బుజ్జి). **...రెస్పాండెంటు**

టు,

ప్రగడ నాగ లింగేశ్వరరావు @ బుజ్జి S/o గోవింద రాజులు, C/o జొన్నా మధు, (R.T.C. డ్రైవర్,), హిందూ, వయస్సు 40 సంవత్సరాలు, D.NO: 4-2-1/1 పోలీస్ క్వార్టర్స్ లైన్ ఎయిర్‌టెల్ కార్యాలయం ఎదురుగా, 1వ అంతస్తు, అన్నపూర్ణ ఆసుపత్రి, తుని, తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, ఆధార్ నెం: 3714 1049 1201. పిన్ 533401

నోటీసు

యిందలి పిటిషనరు విడాకులు కోరుచూ పై కోర్టులో H.M.O.P.NO:98/2024గా పిటిషను ధాఖలు చేసినందున, రెస్పాండెంటు యెన్నిసార్లు పిటిషను నోటీసు పంపినను తీసుకోనందున శ్రీ కోర్టు వారు పేపర్ పబ్లికేషను ద్వారా నోటీసు పంపమని ఆధేశించినందున ఈ పేపర్ ద్వారా మీకు నోటీసు పంపడమయినది సదరు విషయములో మీకు ఎట్టి ఆక్షేపణలు యున్నాను **తేది. 19-06-2025 ఉదయము 10-30 గంటలకు** పై కోర్టు వారి యెదుట స్వయముగా కాని అడ్వకేటు ద్వారా కాని హాజరై తమకు గల ఆక్షేపణలు తెలియపర్చవలేను లేనిచో సధరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానము చేయూదురు అని ఈ నోటీసు మూలంగా తెలియపర్చుడమైనీది.

గొలుసు శంకర రావు

వాది తరుపున న్యాయవాది

నర్సీపట్నం **సెల్ నెం : 9440403999.**

తేది.02-06-2025